

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్‌మీట్ విజేత శ్రీకాకుళం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రస్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రికెట్ స్పోర్ట్స్‌మీట్‌లో శ్రీకాకుళం రెవెన్యూ జట్టు విజయం సాధించింది. గుంటూరులో నిర్వహిస్తున్న 6వ స్పోర్ట్స్‌మీట్‌లో ఫైనల్‌కు చేరిన శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి జట్లు ఆదివారం తలపడ్డాయి. టాస్ గెలిచిన పశ్చిమ గోదావరి బ్యాటింగ్ ఎంచుకొని నిర్ణీత 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 66 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు పది ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 67 పరుగులు సాధించి విజయం సాధించింది. శ్రీకాకుళం జట్టులో నారాయణ 40 పరుగులు, సుధీర్ 22 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. బౌలింగ్‌లో రామారావు 3 వికెట్లు, సునీల్ 2 వికెట్లు తీసుకుని విజయాన్ని అందించారు.

'గడప గడప' పనులకు గండం

- పనులు చేపట్టేందుకు నిరాసక్తత
- చెల్లింపుల పైనే అందరి అనుమానం
- సచివాలయాలకు రూ.20 లక్షలు
- చెల్లింపులకు సిఎఫ్ఎంఎస్ అడ్డంకి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో శాసనసభ్యులు గుర్తించిన పనులు తక్షణమే చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. క్షేత్రస్థాయిలో గుర్తించిన పనులను తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి కచ్చితమైన ఆదేశాలు ఉన్నాయి. అందులో భాగంగానే ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గతంలో వెల్లడించారు. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా ఉన్న ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో అత్యవసరంగా పనులను గుర్తించిన ఎమ్మెల్యేలు, మంత్రులు, స్పీకర్‌తో సహా అందరూ ప్రతిపాదనలు పంపించారు. కలెక్టర్ పర్యవేక్షణలో ఈ పనులు చేపట్టేందుకు అనుమతించాల్సి ఉంది. ఇందులో రూ.ఐదు లక్షల వ్యయానికి పైబడిన పనులన్నింటికీ టెండర్ల ద్వారా చేపట్టాల్సి ఉంటుంది. మిగిలిన వాటిని నామినేషన్ పద్ధతిలో అప్పగించి పనులు పూర్తి చేసుకుంటే ప్రభుత్వానికి పంచించిన తర్వాత సిఎఫ్ఎంఎస్ ద్వారా నేరుగా పనులు చేసిన ఏజెన్సీలకు, కాంట్రాక్టర్ల ఖాతాలకు జమ చేస్తారు. గడిచిన మూడేళ్లలోనే కాక అంతకుముందున్న ప్రభుత్వంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు చెల్లింపులు లేవు. దీంతో వందల మంది చిన్న కాంట్రాక్టర్లు చితికిపోయి అప్పులపాలయ్యారన్న ఆవేదన ఉంది. పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా పారిశుధ్య విభాగంలో పనులు చేయాలంటే కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. పనులు చేయాలని ఇంజినీర్లు బతిమలాడినా వారు చేసేందుకు ముందుకు రావడం లేదు. చిన్న చిన్న పనులు చేసేందుకు పెద్ద కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు ముందుకు రావడం లేదు. దీంతో గడప గడపకు పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొని ఉంది.

నిబంధనలు

గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రజాప్రతినిధులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించి వారు గుర్తించిన సమస్యల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తేనే నిధులు మంజూరు చేస్తారు. పనులకు సంబంధించి మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపి పనులు చేపట్టేందుకు విధిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో తిరిగిన ఎమ్మెల్యేలు ఎక్కడ గోతులు ఉన్నాయి, ఎక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి ఆన్‌లైన్‌లో ఆ సమస్యకు సంబంధించిన ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నెలకొన్న ముఖ్యమైన సమస్యలైన తాగునీటి పైపులైన్లు, బోర్లు, సిసి రోడ్లు, మురుగునీటి కాలువల మరమ్మతులు, ట్యాంకుల నిర్మాణం, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, కమ్యూనిటీ షెల్టర్లు, వరద రక్షణ గోడల నిర్మాణం వంటివి చేపట్టేందుకు ఈ నిధులు కేటాయించారు.



నౌపడ : భావనపాడులో రోడ్డు పనులకు చేస్తున్న శంకుస్థాపన (ఫైల్)

జిల్లాలో జూన్ నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు 163 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగిందని అధికారులు లెక్కలు కట్టారు. అక్టోబరులోనూ అదనంగా దరఖాస్తులు వచ్చి చేరాయి. ఇందులో గుర్తించిన ప్రాధాన్యతా పనులను మాత్రమే చేపట్టేందుకు నిధులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సెప్టెంబరు వరకు 163 సచివాలయాల పరిధిలో గుర్తించిన 908 పనుల్లో 900 పనులకు ప్రతిపాదనలను అధికారులు సమర్పించారు. ఎనిమిది పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. వీటికితోడు అక్టోబరులో 230 ప్రతిపాదనలు పంపించారు. పలు దశల్లో అవి ప్రాసెస్‌లో ఉన్నాయి. మంజూరు చేసిన పనుల్లో 262 పనులు అతి కష్టం మీద ప్రారంభించారు. సెప్టెంబరు వరకు మిగిలిన 638 పనులు ప్రారంభం కాలేదు. పెండింగ్‌లో ఉన్న వాటిలో అధిక సంఖ్యలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల్లో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న పనులన్నీ అక్టోబరు 25వ తేదీ నాటికి ప్రారంభం కావాలని కలెక్టర్ ఆదేశించినా, పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. నామినేషన్లు, టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని, వాటిని ప్రారంభించిన తర్వాత జిజిఎంపి పోర్టల్‌లో నమోదు చేయాలని అధికారులు చెప్తున్నారు. పనులు చేసే వారు ముందుకు రాకపోతే పనులు ఎలా మొదలవుతాయని ఇంజినీరింగ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి

కేసుల సత్వర విచారణతో...

బాధితులకు న్యాయం

- హత్య, ఆస్తి తగదాలు తగ్గుదల
- గృహ హింస, హత్యాయత్నం కేసులు పెరుగుదల
- క్షేత్రస్థాయిలో నాటుసారా నిర్మూలనకు పటిష్ట చర్యలు
- డిజిపి కె.రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కేసుల దర్యాప్తు, విచారణను త్వరితగతిన చేపట్టి బాధితులకు న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఎస్‌పి కార్యాలయంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల పోలీసు అధికారులతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నాలుగేళ్లుగా జిల్లాలో నమోదైన పలు తరహా నేరాలు హత్య, హత్యాయత్నం, మహిళలపై నేరాలు, ఛీటింగ్, రోడ్డు ప్రమాదాలు, ఆస్తి తగాదాలు, దొంగతనాలు, ఆస్తి నేరాలు, గ్రేవ్ కేసులు, ఎస్‌సి ఎస్‌టి కేసులు, పొక్సో తదితర కేసుల నమోదుకు గల కారణాలపై ఆరా తీసి నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులపై సంతృప్తిని వ్యక్తం చేశారు. త్వరితగతిన కేసుల దర్యాప్తు చేపట్టి పరిష్కరించాలని సూచించారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలు, చెక్‌పోస్టులు, జనాభా, నైసర్గిక స్వరూపం, నియోజకవర్గాలు, సబ్ డివిజన్లు, పోలీస్ స్టేషన్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితర అంశాలను ఎస్‌పి జి.ఆర్ రాధిక వివరించారు. దీంతోపాటు జిల్లాలో గతంలో నమోదైన కేసుల వివరాలు, దర్యాప్తు తదితర అంశాలను నివేదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో హత్య, ఆస్తి తగాదాలు, రోడ్డు ప్రమాదాలు వంటి నేరాల నమోదు తగ్గుముఖం పట్టాయన్నారు. ఇదే సందర్భంలో హత్యాయత్నం, కొట్లాట, గృహహింస సంబంధమైన నేరాలు కొంతమేరకు పెరిగాయని తెలిపారు. రెండు జిల్లాల్లో నాటుసారా విక్రయాలు, తయారీ గ్రామాలను గుర్తించి ఆ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

జిమ్ ప్రారంభం

జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన డిజిపిని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీసు అధికారుల జిమ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. జిమ్ పరికరాలను పరిశీలించాక, కాసేపు జిమ్ ప్రాక్టీస్ చేశారు. కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిజి రవిశంకర్ అయ్యర్, విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌పి వి.విద్యాసాగర్, ఎస్ఐబి ఎస్‌పి కె.నాగ మణికంఠ, ఎఎస్‌పిలు కె.శ్రీనివాసరావు, టి.పి విఠలేశ్వర్, ఒ.దిలీప్ కిరణ్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు చేసే వరకు ఉద్యమం

- జిపిఎస్‌తోనూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నష్టమే
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు



సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నష్టం చేకూరుస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యాన సిపిఎస్ రద్దు - ఒపిఎస్ అమలు అనే అంశంపై నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సిపిఎస్‌కు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిపిఎస్ విధానం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏమాత్రం లాభదాయకం కాదన్నారు. కార్పొరేట్లకు లాభాన్ని చేకూర్చే సిపిఎస్, జిపిఎస్ విధానాలను యుటిఎఫ్ అంగీకరించదని తేల్చిచెప్పారు. ఒపిఎస్ మాత్రమే ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు అంగీకారమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేసి, మాట నిలబెట్టుకోవాలని కోరారు. పోరాటాలను చూసి ప్రభుత్వం భయపడుతూ, మనల్ని భయపెట్టాలని చూస్తోందని, అందులో భాగంగా నిర్బంధాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతాల నుంచి కంట్రిబ్యూషన్ కట్టించుకుంటూ పెన్షన్ చెల్లించే విధానాన్ని ఇక అంగీకరించబోమన్నారు. సిపిఎస్ రద్దు హామీ ఇవ్వని కొన్ని రాష్ట్రాల్లో ఆ విధాన్ని రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేస్తూ విధి విధానాలను రూపొందిస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ అమలు కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు కోసం పోరాటాలను ఉధృతం చేస్తామని, అందులో భాగంగా సిపిఎస్ ఇంటికి యుటిఎఫ్, పాదయాత్రలు, మినీ సభలను డిసెంబరు నెలాఖరు వరకు నిర్వహించనున్నట్లు వివరించారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర మాట్లాడుతూ వేసవి సెలవుల కంటే ముందు బదిలీలు పూర్తి చేస్తామని చెప్పిన ప్రభుత్వం, పాఠశాలలు ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా ఆ ఊసెత్తడం లేదన్నారు. ప్రభుత్వ సిఫార్సు బదిలీలు చేయడానికి చేస్తున్న ప్రయత్నం ఆందోళన కలిగిస్తోందన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడవడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణం బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించాలన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల జీతాలు, ఇంక్రిమెంట్లు, సెలవులపై ఉన్న గందరగోళ పరిస్థితులను నివారించాలన్నారు. మున్సిపల్ ప్రధానోపాధ్యాయులకు డిడిఒ పవర్‌ను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎస్ ఇంటికి యుటిఎఫ్ పేరుతో సిపిఎస్ ఉద్యోగుల కుటుంబాలను వారి ఇంటికి వెళ్లి కలిసి సిపిఎస్, జిపిఎస్ వల్ల నష్టాలను వివరించడంతో పాటు రానున్న కాలంలో కుటుంబాలతో కలిపి పోరాటాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.అప్పారావు, కోశాధికారి బి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఆర్.మోహనరావు, సిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ జి.నారాయణరావు, పలువురు యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై విషం కక్కొద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం / టెక్కలి రూరల్

రాజధాని పేరుతో ఉత్తరాంధ్ర ప్రజలను అధికార పార్టీ నాయకులు మోసం చేస్తున్నారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించడం అతని నీచ రాజకీయానికి నిదర్శనమని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వేర్వేరుగా విమర్శించారు. టెక్కలిలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడగా, కృష్ణదాస్ ఒక ప్రకటనను విడుదల చేశారు. మూడేళ్లుగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో అభివృద్ధిపై పవన్ విషం చిమ్ముతున్నారని, సినిమా రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. 2014 నుంచి 2018 వరకు టిడిపితో జనసేన కాపురం చేసిందని, ఏ రోజైనా ప్రజల గురించి చంద్రబాబును ప్రశ్నించే ఉంటే బాగుండేదన్నారు. 17 వేల లేఅవుట్లలో 31 లక్షల మందికి గృహ నిర్మాణం చేపడుతుంటే, అక్కడకు వెళ్లి పవన్ ఏం చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదలకు గృహ నిర్మాణం కోసం పెద్ద యజ్ఞమే సాగుతోందని, అది పవన్‌కు కనిపించలేదా? అని ప్రశ్నించారు. ఇళ్ల స్థలాల ధరలు ఆకాశాన్నంటుతున్న సందర్భంలో అత్యంత విలువైన చోట్ల ప్రభుత్వం ఇళ్ల పట్టాలు అందజేసిందని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను ఓర్చుకోలేని పవన్ అవాకులు చెవాకులు పేలితే ఎవరూ నమ్మరన్నారు. మూడు సెంట్లలో పక్కా ఇళ్లు ఎందుకు కట్టించలేదని చంద్రబాబును ఒకసారైనా ప్రశ్నించారా? అని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు విశాఖ రాజధాని కావాలని, తద్వారా అభివృద్ధికి బాటలు వేయాలని బలంగా కోరుకుంటే దానిపై పవన్ మాట్లాడరని విమర్శించారు. ఇప్పటికైనా కళ్ల ముందు కనిపించే వాస్తవాలు చూడాలని, కళ్లు మూసుకుని నోటికి వచ్చినట్లు మాట్లాడితే మళ్లీ జనమే బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ

ఆదిత్యుని దర్శించుకున్న సిఎస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్ శర్మ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో వారికి ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం సిఎస్ దంపతులకు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. ఆలయ అనివెట్టి మండపంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ స్వామి వారి చిత్ర పటాన్ని అందజేయగా, ఆలయ కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్ఒ ఎం.రాజేశ్వరి, పలాస ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ డి.వి.వి ప్రసాదరావు, తహశీల్దార్ కె.వెంకటరావు, ఆలయ పాలకమండలి సభ్యులు అంధవరపు రఘురాం, మండవిల్లి రవి, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిఎస్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న కలెక్టర్

భార్యను హతమార్చి భర్త ఆత్మహత్య
సముద్రంలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు
మెయిన్ పేజీలో



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

ఘనంగా కా.రా మాస్టారు జయంతి

శ్రీకాకుళం అర్బన్ : ప్రముఖ కథా రచయిత కీర్తిశేషులు కాళీపట్నం రామారావు (కా.రా) మాస్టారు 98వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం సాహితీ సంస్థ ఆధ్వర్యాన నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడారు. కథలపై కా.రా మాస్టారుకు ఉన్న అభిలాషతో వాటిని భవిష్యత్ తరాలకు అందించాలని కథా నిలయాన్ని నెలకొల్పారని చెప్పారు. ఎంతోమంది కవులు, రచయితల కలం నుంచి పుట్టుకొచ్చిన కథలను, పుస్తక రూపాలను భద్రపరచి గ్రంథ నిక్షిప్తానికి వేదికగా నిలిచారన్నారు. కథలపై ఆయనకున్న ఆసక్తి వర్ధమాన కవులకు ఆదర్శమన్నారు. డాక్టర్ వేమూరి కృష్ణమూర్తి, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ కా.రా మాస్టారు గొప్పతనాన్ని వివరించారు. భాషపై పట్టున్న కథా రచయిత కా.రా మాస్టారు అని కొనియాడారు. భావసారూప్యత, నేటి సమాజంలో నెలకొన్న దృక్పథాలపై ప్రజలను జాగృతం చేసేందుకు ఆయన రచనలు దోహదపడ్డాయన్నారు. అనంతరం బాహుదా పుస్తకంతో పాటు కథ 1980 సంపుటి, కా.రా మాస్టారి స్మారక కథా సంకలనం, తెలుగు రచయితల కలం పేర్లు, దిగొచ్చిన దేవత తదితర పుస్తకాలను ఆవిష్కరించారు. తొలుత కా.రా మాస్టారు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సాహిత్య ప్రియులు, కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాలల హక్కుల వారోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా బెజ్జిపురం యూత్ క్లబ్, చైల్డ్‌లైన్, కొలాబ్ సంయుక్తంగా ఈనెల 14నుంచి బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు బెజ్జిపురం యూత్ క్లబ్ కోశాధికారి ఎం.అప్పలనాయుడు తెలిపారు. ఈనెల 21 వరకు నిర్వహించే వారోత్సవాల్లో ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వారోత్సవాలను ఈనెల 14న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ప్రారంభించనున్నారని చెప్పారు. నగరంలోని బెజ్జిపురం యూత్ క్లబ్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణకు యూత్ క్లబ్ నాలుగు దశాబ్దాలుగా పనిచేస్తోందని చెప్పారు. చైల్డ్‌లైన్ సేవా కార్యక్రమాలు, బాలల హక్కులు, చట్టాలపై అవగాహన పెంచేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 14 మండలాల్లో చైల్డ్‌లైన్ సేవలపై అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారుల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2011 నుంచి 2022 మధ్య కాలంలో సుమారు ఏడు వేల మంది బాలలను సంరక్షించినట్లు తెలిపారు. 18 ఏళ్ల లోపు బాలలు ఎటువంటి ఆపదలో ఉన్నా చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నంబరు 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో చైల్డ్‌లైన్ నోడల్ కో-ఆర్డినేటర్ ఎం.సింహాచలం, కొలాబ్ కో-ఆర్డినేటర్ పి.హేమలత, కౌన్సిలర్ యు.మెహెర్వాణి, డి.రాజు, డి.మౌనిక, వై.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ఆమదాలవలస : పార్టీకి అతీతంగా అర్హతే ప్రామాణికంగా మధ్యవర్తిత్వం లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుని ఖాతాలోనే ప్రభుత్వం జమ చేస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కట్యాచార్యులపేట సచివాలయం పరిధిలోని వెదుళ్లవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడాను బేరీజు వేయాలన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని పది కాలాల పాటు నిలిచేలా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపిలు మానుకొండ వెంకటరమణ, సోమరాజు జగన్నాథం, సర్పంచ్ చిలకలపల్లి సురేష్, ఎన్ని చంద్రయ్య, సైలాడ దాసునాయుడు, వైసిపి నాయకులు, అధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న శాసనసభ స్పీకర్ సీతారాం

ఆర్‌బికెల్లో పశు విజ్ఞాన బడి

- రైతుల్లో అవగాహనకు తోడ్పాటు
- సంచార వాహనాల ద్వారా శస్త్ర చికిత్సలు
- పాడి రైతులకు నిరంతరాయంగా సేవలు
- పశుసంవర్ధక శాఖ జెడి ఎం.కిషోర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రైతుభరోసా కేంద్రాల్లో వారానికో రోజు పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.కిషోర్ తెలిపారు. ఆర్‌బికెల ద్వారా రైతు సేవలను విస్తృతపరచడంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన రైతులతో పశువుల పెంపకం, మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పలు అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.



రైతుభరోసా కేంద్రాల్లో పశుసంవర్ధకశాఖ ద్వారా ఎలాంటి సేవలందిస్తున్నారు?

జిల్లాలో 453 రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయి. వారంలో ఒక రోజు ప్రతి రైతుభరోసా కేంద్రంలో నిపుణుడైన పశు వైద్యుని పర్యవేక్షణలో చికిత్సలు చేస్తున్నాం. పశువైద్య సహాయకులను ఆర్‌బికెల్లో అందుబాటులో ఉండాలని సూచనలు చేశాం. పాడి రైతుల సమస్యలను వారి ద్వారా పరిష్కరిస్తాం. పశువైద్య కేంద్రాలతో పాటు రైతుభరోసా కేంద్రాల్లో ఉన్న సిబ్బంది సమన్వయంతో రైతులకు సేవలందిస్తున్నారు.

వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య వాహనాల ద్వారా ఎలాంటి సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నారు?

వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య వాహనాలు నియోజకవర్గానికి ఒకటి అందించారు. ముందుగా రెండు నియోజకవర్గాలకు ఈ వాహనాల ద్వారా సేవలు అందించాం. కొత్త వాహనాలు అందుబాటులోకొచ్చాక పశువులకు మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమైంది. ప్రధానంగా గ్రామంలోనే పశువులకు వైద్యం అందించేందుకు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అత్యాధునిక సౌకర్యాలు ఈ వాహనాల్లో అందుబాటులో ఉండడం వల్ల అత్యవసర శస్త్రచికిత్సలు స్థానికంగానే చేసేందుకు వీలవుతుంది.

రాయితీ యంత్రాల విషయంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారా?

పశుసం వర్ధకశాఖ ద్వారా అందించే ప్రతి పథకానికి సంబంధించిన రాయితీల గురించి పాడి రైతులకు వివరిస్తున్నాం. రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజనలో భాగంగా 2022-23 సంవత్సరానికి గడ్డి కోసే యంత్రాలు రాయితీపై అందిస్తున్నాం. ఈ యంత్రం 2 హెచ్‌పి, 3 బ్లేడ్స్ మోడల్ రూ.33,970 అవుతుంది. ఈ యంత్రానికి ప్రభుత్వం 40 శాతం రాయితీ అందిస్తుంది.

పశువైద్య సహాయకులు, గోపాలమిత్రలకు అందిస్తున్న శిక్షణ ఎంతవరకు వచ్చింది?

మైత్రి శిక్షణ పేరుతో పశు వైద్య సహాయకులు, గోపాలమిత్రలకు రెండు విడతలుగా ఐదు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నాం. వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు ఉపయోగ పడుతుంది. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి ఈ శిక్షణ దోహదపడుతుంది.

బ్రూసెల్లా వ్యాధికి సంబంధించి వ్యాక్సినేషన్ ఏ దశలో ఉంది?

నాలుగు నెలల నుంచి ఎనిమిది నెలల ఆడ పశువుల్లో బ్రూసెల్లా వ్యాధి రాకుండా ఉండేలా టీకాలు వేస్తున్నాం. ఇప్పటికే రెండు విడతలు పూర్తి చేశాం. మూడో విడత మరికొన్ని రోజుల వ్యవధిలో మొదలుపెడతాం. వీటితోపాటు ఇతర వ్యాక్సినేషన్ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. రైతులకు ప్రయోజనం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఆ లక్ష్యం దిశగా పశుసంవర్ధక శాఖ రైతులకు నిరంతరాయంగా సేవలు అందిస్తోంది.

ప్రజాశక్తి
www.prajasakti.com

అరసవల్లిలో ధర్మపథం

ప్రజాశక్తి–శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ధర్మపథం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలయ అనివెట్టి మండపంలో పాలకొండ భారతీయ సంస్కృతి నృత్య శిక్షణాలయం ఆధ్వర్యాన రామాయణం నృత్య రూపకం, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ సప్తస్వర భక్త గీతాంజలి బృందంతో భక్తి సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహించారు.



యాత్రికులతో రద్దీగా ఉన్న అరసవల్లి క్యూలైన్లు

పెరిగిన ఆదాయం

కార్తీకమాసం మూడో ఆదివారం కావడంతో అరసవల్లి ఆలయానికి యాత్రికుల రద్దీ పెరిగింది. దీంతో ఆలయానికి ఒక్క రోజే రూ.14.21 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.9,87,900, విరాళాల రూపంలో రూ.54 వేలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3.80 లక్షలు ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

పార్టీ విజయం కోసం పనిచేయాలి

ప్రజాశక్తి – కోటబొమ్మాళి

ప్రతి కార్యకర్త వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం కోసం ఇప్పటి నుంచే కష్టపడి పని చేయాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం నిమ్మాడ గ్రామంలో తన క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ఆయనను కలిసి, తమ సమస్యలు తెలియజేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని, త్వరలో వైసిపి అరాచక పాలన నడుస్తోందని అన్నారు. ప్రజలతో పాటు ప్రతి కార్యకర్తకు, నాయకులకు టిడిపి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మరో రెండేళ్లు ఓపిక పడితే మళ్లీ టిడిపి అధికారంలోకి వస్తుందని, అప్పటివరకు ఈ సమస్యలు ధైర్యంగా ఎదుర్కోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అచ్చెన్నాయుడును కలిసిన టిడిపి నాయకులు

సుడిదోమతో రైతులు కుదేలు

ప్రజాశక్తి – సంతబొమ్మాళి

మండలంలో సుడి దోమతో రైతులు కుదేలవుతున్నారు. గోవిందపురం, నర్సాపురం, పాల తలగాం, సంతబొమ్మాళి, డి.జి.పురం సచివాలయాల పరిధిలో సుడి దోమ ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆర్.హెచ్.పురం, ఉమిలాడ, చిన్న తుంగాం, లక్కివలస, మేఘవరం, కోటపాడు సచివాలయాల పరిధిలో పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో సుడి దోమ వల్ల రైతులు నష్టపోయారు. చేతికందిన పంట చూస్తుండగానే నాశనం అవుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. సుడి దోమతో నష్టపోయిన రైతులను ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆదుకోవాలని కోరుతున్నారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారి జె.శ్రీలక్ష్మి మాట్లాడుతూ సుడి దోమ ఉధృతి తీవ్రంగా నష్టపోయిన పంట పొలాలను పరిశీలించామని అన్నారు. సుడి దోమ నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా/లీ, లేదా మోనో క్రోటో ఫాస్ 1.6 మి.లీ/లీ లేదా బుప్రో ఫెజిన్ 1.6 మి. లీ/లీను దుబ్బు మొదల్లు వద్ద పిచికారి చేయాలన్నారు.



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఎఒ శ్రీలక్ష్మి

స్పందనకు అభినందనలు

ప్రజాశక్తి –బూర్జ

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో శని, ఆదివారం జరిగిన సపక్‌తక్రా రాష్ట్ర స్థాయి జూనియర్స్ అండర్–19 విభాగంలో జిల్లా బాలికల జట్టు తృతీయస్థానంలో నిలిచింది. బూర్జకు చెందిన ఒపివాడ వెంకంపేటకు చెందిన బుడుమూరు స్పందన జట్టులో మెరుగైన ఆట తీరు ప్రదర్శించింది. ఈసందర్భంగా ఆమెకు, కోచ్ అర్జున్‌రెడ్డికి ఎంపిపి బుడుమూరు సూర్యారావు అభినందనలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

52 జిఒ రద్దుకు రాష్ట్రపతికి పోస్టుకార్డు

ఆదివాసీ సంక్షేమ పరిషత్ నిర్ణయం

ప్రజాశక్తి –శ్రీకాకుళం

జిఒ నంబరు 52 రద్దుకు రాష్ట్రపతికి పోస్టు కార్డు పంపాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ సమావేశం నిర్ణయించింది. ఆదివారం సారవకోటలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న ప్రతి గిరిజనుడు పోస్టు కార్డు పంపాలన్నారు. గిరిజన గ్రామంలో వినూత్నంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 25న జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రిని కలిసేందుకు గిరిజన సంఘాలకు అవకాశమివ్వాలన్నారు. బోయ, వాల్మీకి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న నకిలీ బెంతు ఒరియాలను గిరిజన తెగల్లో చేరిస్తే ఊరుకోబోమన్నారు. సమావేశంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు చింతపల్లి భాస్కరరావు, మండలం ముఖ్య సలహాదారులు, పడాల మాధవయ్య, కోశాధికారి ఈశ్వరరావు, జిల్లా ముఖ్య సలహాదారులు రామారావు, బింజన్న, బొంతు భాస్కర్, లచ్చుమయ్య, నీలయ్య, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాబ యోగి

మోడల్ క్లబ్‌గా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి – ఇచ్ఛాపురం

ఏలియన్స్ క్లబ్ ఇచ్ఛాపురాన్ని మోడల్ క్లబ్‌గా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో భారీ స్థాయిలో ఇనాగరల్ ఫంక్షన్ ఏర్పాటు చేసినట్లు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలియన్స్ క్లబ్ గవర్నర్(విశాఖ) గాంధీ అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2008లో కలకత్తాలో స్థాపించిన క్లబ్ నేటికీ ప్రపంచంలో 20 దేశాల్లో విస్తరించుకుంటూ సుమారుగా 2వేల క్లబ్‌లుగా ఏర్పడిందన్నారు. ఆదివారం ఏలియన్స్ క్లబ్ ఇచ్ఛాపురం ప్రారంభమైందని, దీనిలో 30వేల మంది మెంబర్లుగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా 30 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సురంగి రాజా మైదానానికి తనవంతుగా సాయం చేస్తూ మైదానాన్ని అభివద్ధి చేస్తున్న బత్తుల వెంకటరమణను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎల్.నరసింహమూర్తి, టి.లక్ష్మణరెడ్డి, కె.సత్తెమయ్య, డాక్టరు పి.దేవేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత ఉద్యోగిని సన్మానిస్తున్న గాంధీ

'ఆదిత్య'లో సైబర్ సెక్యూరిటీ సదస్సు

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 7 నుండి 12 వరకు రెండో ఏడాది బిటెక్ కోర్సుకు చెందిన 200 మంది విద్యార్థులకు 'సైబర్ సెక్యూరిటీ హేఫ్తాన్' అనే అంశంపై జరిగిన సదస్సు ఆదివారంతో ముగిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన సుప్రజా టెక్నాలజీస్ సిఇఒ సంతోష్ సెల్వాడ్ పాల్గొని సైబర్ సెక్యూరిటీ హేకతానైపై వర్కుషాపును వారం రోజుల పాటు నిర్వహించారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగాలకు అత్యంత ఉపయోగపడే ఈ హేకతాన్ సెక్యూరిటీపై ఐతమ్ విద్యార్థులకు అవగాహన కల్పించడం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. ఈ రంగంలో విద్యార్థులకు భవిష్యత్‌లో పెద్దఎత్తున ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని డైరెక్టర్ పేర్కొన్నారు. ఈ శిక్షణలో ప్రతిభ కనపరచిన ఐతమ్ విద్యార్థులకు విజయవాడలోని సుప్రజా టెక్నాలజీస్‌కు తీసుకెళ్లి, నెల రోజుల పాటు ఇంటర్‌షిప్ చేసుకొనే వీలు కల్పిస్తారని తెలిపారు. సమావేశంలో ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఫిన్సింగ్ స్కూల్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, ఐఐసి కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.సతీష్, శాక్ ఇన్‌ఛార్జి జె. సురేష్ కుమార్, గిరీష్, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

జిఒ 559ను అమలు చేయాలి

నందిగాం: పచ్చికబయలు, గోర్జి పోరంబోకులు ఆక్రమణకు గురికావడంతో గొర్రెలు, మేకల పంపెకం కష్టతరంగా మారిందని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన సాంబమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జీవాలకు హైవే, రైల్వే లైను దిక్కుగా మారాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ 559, 1016లను అమలు చేయాలని, బంజరు భూములు, కాలువ గట్లు, కాలువ గట్లు, చెరువు గర్భాలను జీవాల మేతకు కేటాయించాలని కోరారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి – మందస

కార్మికవర్గం ఐక్య పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవడం సాధ్యమవుతుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనరు కె.నాగమణి అన్నారు. మందసలో సిఐటియు మండల మహాసభ నిర్వహించారు. తొలుత హైస్కూల్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలో జగన్ కలిసి కార్మికుల హక్కులను తుంగలో తొక్కి పెట్టి, పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నారని మండిపడ్డారు. కనీస వేతనాలు గానీ, పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్ చట్టబద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పోరాడాలని పిలుపునిచ్చారు. ధరల భారం వల్ల కూలి చాలక కార్మికులు అర్ధాకలితో బతుకుతున్నారని, కార్మికుల సంక్షేమానికి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు మార్చేసి లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మిక హక్కులు కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసి, ప్రజా సంక్షేమం గాలికొదిలేసి బడా పారిశ్రామిక వేత్తలకు దోచి పెడుతున్నారని విమర్శించారు. భూమి నుంచి రైతును దూరం చేస్తూ, కార్మికులను నష్టం కలిగించే విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.గణపతి, మండల నాయకులు ఆర్.దిలీప్‌కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పెరుగుతున్న అసంఘటితరంగ కార్మికులకు ఉపాధి భద్రత కల్పించి, కార్మిక హక్కులు అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల గౌరవాధ్యక్షులు మట్ట ఖాగేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు ఎస్.వల్లభరావు, పి.అప్పలస్వామి, టి.లక్ష్మీనారాయణ, ఎస్.జగ్గారావు, వై.యశోద, బాలమ్మ, జీడి, రైస్ మిల్లు కార్మికులు, హమాలీలు గ్రీన్ అంబాసిడర్ కార్మికులు, పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నూతన కమిటీ కన్వీనర్‌గా కె.కేశవరావు, కో–కన్వీనర్‌గా పి.దేవేంద్రతో పాటు పది మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

అంగన్వాడీల వేతనాలను పెంచాలి

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సుధ

ప్రజాశక్తి – పొందూరు

అంగన్వాడీల వేతనాలు పెంచాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్, అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుధ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కంటే రూ.వెయ్యి ఎక్కువ వేతనం ఇస్తామని గతంలో ముఖ్యమంత్రి చెప్పారని, నేడు తెలంగాణలో మనకంటే ఎక్కువ వేతనం ఇస్తున్నారని అన్నారు. ధరలు విపరీతంగా పెరిగినా అంగన్వాడీల వేతనాలు పెంచలేదని, నామమాత్రపు వేతనాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. కార్యకర్తలతో సమానంగా మినీ వర్కర్లకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సెంటర్లకు మంచినీరు, ప్రహరీ, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, కుర్చీలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలని కోరారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్న మెనూకు తగిన విధంగా మెనూ ఛార్జీలు, సరుకుల క్వాంటిటీని పెంచలేదని అన్నారు. గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, చాలీచాలని వేతనాలతో అంగన్వాడీలు ఉద్యోగాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేవారు. గుంటూరులో ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరగనున్న పదో రాష్ట్ర మహాసభలు జయప్రదం పిలుపునిచ్చారు. అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెన్ఫిట్స్ ఇవ్వాలని, కనీసం రూ.5 లక్షలు గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్.చంద్రమౌళి, ఇ.కళ్యాణి, బి.పూర్ణిమ, బి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు సుధ

సాగర తీరంలో కోలాహలం

ప్రజాశక్తి –నౌపడ

సంతబొమ్మాళి మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన భావనపాడు, మేఘవరం, సున్నాపల్లి తీరాల్లో ఆదివారం పిక్నిక్ సందడి నెలకొంది. పెద్ద ఎత్తున వచ్చిన యాత్రికులు, యువత, మహిళలతో సాగర తీరం కిటకిటలాడింది. ఒడిశా ప్రాంతంతోపాటు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన యాత్రికులు జీడి, సరుగుడు తోటల్లో ఉల్లాసంగా గడిపారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా మధ్యాహ్నం నుండి సముద్రంలో స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మెరైన్ పోలీసులు, నౌపడ పోలీసులు రక్షణ చర్యలు చేపట్టారు.

సందడే సందడి

పోలాకి: మండలంలోని రాజారాంపురం సముద్ర తీరంలో యాత్రికుల సందడితో కోలాహలంగా మారింది. కార్తీక మాసం మూడో ఆదివారం కావడంతో పిల్లలు, పెద్దలు, ఉద్యోగులు కుటుంబ సభ్యులతో వచ్చి వన భోజనాలు చేశారు. సముద్ర స్నానాలు, నృత్యాలు చేసి ఎంతో ఆనందంగా గడిపారు.



రాజారాంపురం సముద్ర తీరంలో స్నానాలు చేస్తున్న యాత్రికులు



నౌపడ: సముద్ర స్నానాలు చేస్తున్న యాత్రికులు



చిలక సరస్సులో ఉపాధ్యాయులతో వజ్జ బాబూరావు, గంగా భవాని

'మదర్ థెరిసా' హంగామా

పలాస: మదర్ థెరిసా పాఠశాల యాజమాన్యం ఆదివారం పిక్నిక్ నిర్వహించింది. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందితో కార్తీక వనభోజనాలలో భాగంగా ఒడిశా రాష్ట్రం చిలక సరస్సు, తంపర, తదితర ప్రాంతాల్లో పర్యటించి సందడి చేశారు. పాఠశాల కరస్పాండెంట్ వజ్జ బాబురావు, వజ్జ గంగా భవాని మాట్లాడుతూ ప్రతి ఏటా కార్తీక మాసంలో వన భోజనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో కృష్ణారావు, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రసాదరావు, నెమలిపురి తులసీరావు, చంద్రమౌళి, జగదీష్ పండా, జోగారావు, భాస్కరరావు, కూర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ-వేమనకు కవితా పురస్కారం

ప్రజాశక్తి – రణస్థలం

రణస్థలం ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ప్రముఖ కవి మహ్మద్ రఫీ(ఈవేమన) కవితా పురస్కారం అందుకున్నారు. నారంశెట్టి సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు బాలల దినోత్సవం సందర్భంగా పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా పార్వతీపురం ఆర్యవైశ్య కళ్యాణ వేదికలో బాల సాహిత్యంలో కృషి చేసిన వారికి కొసరాజు సురేష్, బెహరా ఉమామహేశ్వరరావు ఈవేమనకు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా మహ్మద్ రఫీ మాట్లాడుతూ తాను రాసిన కవితకు ప్రోత్సహక బహుమతి అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈవేమన కలం నుంచి మరిన్ని రచనలు రావాలని సభలో వక్తలు కొరుతూ అభినందనలు తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న ఈ-వేమన

రాపాకలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి –పొందూరు

మండలంలోని రాపాకలో కోనేటి చెరువు సమీపంలో రూ.3.50లక్షల జెడ్‌పి నిధులతో తాగునీటి బోరును ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు తెలిపారు. ఈ బోరు నుంచి గ్రామంలోని సచివాలయాలు, ఆర్‌బికెలు, మిల్క్, హెల్త్‌సెంటర్లుతో పాటు ప్రభుత్వ పాఠశాలకు పైపులైన్ ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రత్యేక చొరవతో ఈ తాగునీటి బోరును మంజూరు చేశారని, గ్రామస్తుల తరుపున ఆయన స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



బోరు ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న గిరిబాబు

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి – నందిగాం

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి కోరారు. ఆదివారం నందిగాం శిరిడిసాయి దేవాలయం సమీపంలో కాలువ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగులో భాగంగా కాలువ నిర్మాణం చేపట్టడంతోపాటు పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురుమాన బాలకృష్ణారావు, సర్పంచ్ ప్రతినిధి జడ్యాడ జయరాం, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణు, మండల పరిషత్ ప్రత్యేక అహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, వైసిపి నాయకులు ప్రగడ ప్రభాకరరావు, మాదిన జయంతిరావు, సనపల చిన్నారావు, బలిడే రమణయ్య, కొత్తపల్లి మోహనరావు, పిన్నింటి శ్రీధర్, సనపల అప్పలరాజు,ప్రగడ ఖగీష్ తదితరులు పాల్గొన్నారు.



కాలువ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న శ్రీరామ్మూర్తి

భావితరాల బాధ్యత విద్యార్థులదే

ప్రజాశక్తి – పలాస

భావితరాలను కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని, ఆ దిశగా ముందుకు సాగాలని కాశీబుగ్గ ప్రముఖ వైద్యులు తెప్పల ఆనంద్‌రావు అన్నారు. మండలంలోని నీలావతి గ్రామంలో ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ముందస్తుగా నవభారత నిర్మాత , భారతదేశ పప్రథమ ప్రధానమంత్రి నెహ్రూ జన్మదినం సందర్భంగా ఆదివారం ఘనంగా బాలల దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూ భారతదేశాన్ని అభివృద్ధి, శాస్త్ర సాంకేతిక బాటలో నడిపించారని, నేటి పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వకత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి అంపోలు వాగ్దేవి, ద్వితీయ బహుమతి బచ్చల అక్షయ, తృతీయ బహుమతి కడియం దివ్య, జూనియర్ విభాగంలో పి.మౌనిక, కె.అమృత, సిహెచ్ గ్రీష్మ, మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వక్తృత్వ పోటీల్లో సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి ఆర్.తేజేశ్వరి, ద్వితీయ బహుమతి కె.జాయ్, తృతీయ బహుమతి ఎం.అమీషా, జూనియర్ విభాగంలో టి.అర్చన, బి.లాస్య, ఎస్.జోత్స్న, చిత్రలేఖనం సీనియర్ విభాగంలో టి.కార్తిక్, బి.పావని, బి.యశ్వంత్, జూనియర్ విభాగంలో ఐ.నాగేశ్వరరావు, ఆర్ రోహిత్, ఎం.వినయ్‌కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉద్దాన విద్యాభివద్ధి వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఇషాకోట జోగారావు బొడ్డు చిన్నారావు, యంపల్ల కామేష్, గౌరవ అధ్యక్షులు బి.ఓంకార్, రెయ్యి కష్ణారావు, ఉపాధ్యక్షురాలు గీతమ్మ, గ్రంథాలయం కన్వీనర్ కుత్తుం ప్రకాశరావు, పూర్వ అధ్యక్షులు తెప్పల వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో యువివి సభ్యులు

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్‌లో వంశధార నదిలో శనివారం గల్లంతైన విద్యార్థి మృతి దేహం ఆదివారం లభ్యమైంది. కాశీనగర్ పట్టణంలోని పదో వార్డుకు చెందిన బర్ల భాస్కరరావు కుమారుడు బర్ల ఆకాష్ శనివారం నదికి వెళ్లి ఈతరాక నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న ఆకాష్ తండ్రి భాస్కరరావు సమాచారాన్ని పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి అందించారు. గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం విద్యార్థి మృతదేహం లభ్యమైంది. కాశీనగర్ ఐఐసి. సుశాంత్ సాహు అధ్వర్యంలో పర్లాకిమిడి జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి

వజ్రపుకొత్తూరు: చొరబాటుదారులపై తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని భావనపాడు మెరైన్ సిఐ జి.దేముళ్లు కోరారు. ఆదివారం దేవునల్తాడ గ్రామంలో సి విజిల్– 22 కోస్టల్ ఎక్సర్‌సైజ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ తీర ప్రాంత రక్షణలో భాగంగా ఈ నెల 15, 16 తేదీల్లో రాష్ట్రంలోని తీర ప్రాంతంలో సి విజిల్–22 పేరుతో కోస్టల్ ఎక్సర్సైజ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేవీ ఆక్టోపస్, సిఐఎస్ఎఫ్, ఇండియన్ కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు, మత్స్య శాఖ సిబ్బంది, పోలీసులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు ఈ తేదీల్లో విషయాన్ని గమనించి, మత్యకారులు, తీర ప్రాంత ప్రజలు, పోలీసులు చొరబాటు దారులను ఎలాగైనా సరే గుర్తించాలని, ఎవరైనా చొరబాటు దారులను గుర్తించినట్లయితే కోస్టల్ పోలీసులకు లేదా స్థానిక పోలీసులకు వెంటనే తెలియజేసి, దేశ భద్రతలో తీర ప్రాంత ప్రజలు భాగస్వాములై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. చొరబాటు దారులను, ప్రజలు ఎవ్వరూ కొట్టడం గానీ, దూషించడం గానీ చేయరాదని, వారిని చూసి భయపడనవసరం లేదన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలతో పాటు మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న మెరైన్ సిఐ

పెద్ద చెరువు అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి–రణస్థలం

మండల కేంద్రంలోని పెద్ద చెరువును అభివృద్ధి చేసి, ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలకు అందించడమే లక్ష్యమని వైసిపి యువ నాయకులు పిన్నింటి సత్యంనాయుడు అన్నారు. ఇప్పటికే పెద్ద చెరువు వద్ద ఉన్న మర్రిచెట్టు చుట్టూ తన సొంత నిధులతో రచ్చబండ నిర్మాణం చేపట్టానని, చెరువులో పూడికలు తీయించి, పిచ్చిమొక్కలు తొలగించినట్లు చెప్పారు. చెరువు గట్టుపై కూర్చోవడానికి బల్లలు, ఆంజనేయస్వామి ఆలయం, చెరువు చుట్టూ విద్యుత్ కాంతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల కేంద్రానికి తలమానికంగా ఉన్న పెద్ద చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌తో పాటు, గ్రీనరీ ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ చెరువు అభివృద్ధికి మరింత తోడ్పాటును అందించి రణస్థలం పెద్ద చెరువును అభివద్ధి చేసి పూర్వ వైభవం తెవాలని పిలుపు నిచ్చారు.



అభివృద్ధి చేస్తున్న రణస్థలం పెద్ద చెరువు

జగనన్న ఇళ్లు... పేదలకు కన్నీళ్లు

జనసేన ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి – విలేకరుల యంత్రాంగం

జగనన్న ఇళ్ల కాలనీల్లో లోపాలను, ప్రజల ఇబ్బందులను తెలియజేయాలని జనసేన పార్టీ పిలుపుమేరకు జిల్లాలోని ఇచ్ఛాపురం, పొందూరు, కోటబొమ్మాళి, మెళియాపుట్టి, తదితర మండలాల్లో జనసేన నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించారు.

ఇచ్ఛాపురం మండలం ముచ్చింద్ర పంచాయతీలోని జగనన్న ఇళ్ల కాలనీలో జనసేన పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దుర్యోధన రెడ్డి పర్యటించారు. అసంపూర్ణంగా ఉన్నా కాలనీ ఇళ్ల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల ఇళ్లు నిర్మిస్తానని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన జగన్ వాటిని నెరవేర్చలేదని మండిపడ్డారు. ఆయనతో పాటు జనసేన కార్యకర్తలు ఉన్నారు.

కోటబొమ్మాళి మండలంలోని తర్లిపేటలోని జగనన్న ఇళ్ల కాలనీని జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ పర్యటించారు. కొండపై కనీసం మౌలిక వసతులు లేని ప్రాంతంలో పేదలకు ఇళ్ల పట్టాలిచ్చారని, దీంతో ఇళ్ల నిర్మాణం జరగలేదని అన్నారు. ప్రభుత్వమే పేదలకు ఇళ్లు కట్టివ్వాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు జనసేన నాయకులు శ్రీను, రమేష్, హరి, గురయ్య, గణపతి, చిరంజీవి, తదితరులు ఉన్నారు.

కృష్టపురం పంచాయతీలోని కాకర్లకొండ దగ్గర జగనన్న ఇళ్ల కాలనీ స్థలాలను జనసేన నాయకులు కోటేశ్వరరావు, సుధీర్ పరిశీలించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు షణ్ముఖ, సంతోష్, వినోద్, రమేష్; చందు, ప్రసాద్, జనార్ధన్, శ్రీను, ఉదయ్‌పవన్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నా... ఇళ్లేవన్నా!

రాష్ట్రంలో లక్షలాది ఇళ్లను మంజూరు చేశామని, వాటిలో 50 శాతం ఇళ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని ప్రభుత్వం ఊకదంపుడు మాటలు చెబుతోందని ఇచ్ఛాపురం జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ అధినేత ఆదేశాల మేరకు కవిటి మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న ఇళ్ల స్థలాలను రాజేష్ ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చిన చాలా ఇళ్ల స్థలాలు నిర్మాణానికే పనికిరావని ఆరోపించారు. అందరికీ న్యాయం జరిగేలా జనసేన పార్టీ తరపున పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, కార్యకర్తలు, జన సైనికులు పాల్గొన్నారు.

పొందూరు మండలంలోని రాపాక, కొంచాడ, కృష్ణాపురంలో జగనన్న ఇళ్లస్థలాల నిర్మాణ కేటాయింపు ప్రాంతంలో ఆదివారం జనసేన పార్టీ నాయకులు నిరసన తెలిపారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణానికి వీలుకాని కొండ ప్రాంతంలో పట్టాలు ఇచ్చి మూడేళ్లు అవుతున్నా నేటికి ఒక్క ఇళ్లు నిర్మాణం చేపట్టలేదని అన్నారు. ఇళ్లు నిర్మాణాలను తొందరగా చేపట్టి పేదవారి సొంతంటి కలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల జనసేన నాయకులు కొంచాడ చిన్నంనాయుడు, జామాన అప్పలనాయుడు, బాబూరావు, సిమ్మినాయుడు, బాలు, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి మండల కేంద్రం, మర్రిపాడు–సిలోని జగనన్న ఇళ్ల కాలనీలను జనసేన పార్టీ నాయకులు దుక్క బాలరాజు ఆధ్వర్యాన నాయకులు ఆదివారం పరిశీలించారు. 103 ఇళ్ల స్థలాలు కేటాయించారని, ఆ కాలనీల్లో రోడ్ల నిర్మాణం, విద్యుత్, నీటి సదుపాయం ఏమీ లేవన్నారు. ఆయన వెంట నాయకులు సవలాపురం చంటి, పత్రి మణికంఠ, లోకొండ చంటి, కె.వెంకటేష్, పెదనాపురం కృష్ణారావు, పాపారావు, గుమ్మడి అప్పారావు, బి.రామయ్య, లక్ష్మణరావు, రాకేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు..



మెటియాపుట్టి : నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు



ఇచ్ఛాపురంలో..



కోటబొమ్మాళిలో..



పొందూరులో..



కవిటిలో..

పరిశుభ్రతతో ఆహ్లాదకర వాతావరణం

ప్రజాశక్తి - నందిగాం

గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండే చెరువులు పరిశుభ్రం చేయడం వల్ల ఆహ్లాదకరమైన వాతావరణ నెలకుంటుందని నందిగాం ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. ఆదివారం నందిగాం బస్టాండ్ వద్ద ఉన్న కోనేరు చుట్టూ కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు చుట్టూ ఉన్న మొక్కలను తొలగించాలని, నాచు, గుర్రపు డెక్కన్‌ను తొలగించి ప్రజలకు ఉపయోగకారంగా తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, సర్పంచ్ ప్రతినిధి జడ్యాడ జయరాం, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణు, గ్రామస్తులు ప్రగడ చలపతిరావు, ప్రగడ ప్రభాకరరావు, బి.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు

తెలగలను బిసి-ఎలో చేర్చాలి

పొందూరు: ఉత్తరాంధ్ర తెలగ కులస్థులను బిసిలుగా గుర్తించి, బిసి-ఎలో చేర్చాలని జిల్లా తెలగ కులస్థుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ద్వారపు అజిత్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పిట్టావారి తోటలో జరిగిన తెలగ కులస్థుల వనభోజనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రకులాల్లో ఉన్న పేదవారికి ఈడబ్ల్యుసి సదుపాయాన్ని కల్పించిందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో ఉన్న తెలగ కులస్థులంతా కలిసికట్టుగా ముఖ్యమంత్రిని కలిసి మన కులం వెనుకబాటుతనాన్ని, మనగోడును వినిపించాలని అన్నారు. కార్యక్రమంలో తెలగ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పిల్లల రామకృష్ణారావు, సిద్దా జగదీశ్వరరావు, పిట్టా వెంకట దుర్గారావు, గట్టి వెంకటేష్, పిట్టా గోవిందరావు, పసుపురెడ్డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పలాస: కాశీబుగ్గ బాలసదనంలో ఆదివారం కొర్లాం జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఆర్.చైతన్య, ఆర్.అంజు మాట్లాడుతూ పిల్లలు భవిష్యత్ స్ఫూర్తిదాతలని, దృఢ సంకల్పంతో అద్భుతాలు సృష్టించి తల్లిదండులకు మంచి పేరు తీసుకొస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఏ దిక్కు లేనివారమని నిరాశ చెంద వద్దని, కాలం గడుస్తున్నకొద్దీ బాధల వలయాలు దూరమవుతాయని హిత బోధ చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ సునంద దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - సోంపేట

మండలంలోని మామిడిపల్లి గ్రామంలో కామ్రేడ్ గానుగల తరుణాచారి స్మారక విజ్ఞాన కేంద్ర భవనం నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కామ్రేడ్ జుత్తు సింహాచలం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ తరుణాచారి ఉద్యమానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయిన పేరుపై స్మారక విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామం అన్నారు. కార్యక్రమంలో పి.కృష్ణమూర్తి, శేషగిరి, దున్న మాధవరావు, తెప్పల పాపారావు, గోరకల లింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దక్షిణ ఒడిశా కవి సమ్మేళనం

ప్రజాశక్తి - పర్లాకిమిడి

గజపతి జిల్లా పర్లాకిమిడిలోని టౌన్ హాల్‌లో దక్షిణ ఒడిశా కవి సమ్మేళనం ఆదివారం కూడా కొనసాగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫార్మర్ ఫైనాన్స్ మంత్రి పంచానన కానంగో, గజపతి జిల్లా జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు మాట్లాడారు. సమాజాన్ని ఉత్తేజింపజేసే రచనలు చేయాలని కోరారు. ప్రధాన వక్తగా ఆర్య సమాజం అధ్యక్షులు ఆర్యకుమార్ జ్ఞానేంద్ర వ్యవహరించారు. వ్యాఖ్యాతగా దక్షిణ ఒడిశా సాహిత్య సమ్మేళనం అధ్యక్షులు ప్రశాంత్ మిశ్రా వ్యవహరించారు. సమ్మేళనంలో ఒరియా భాషాభివృద్ధికి కృషి చేయాలని, అందరూ ఒరియాలోనే మాట్లాడాలని, వివిధన వినతి పత్రాలు, బోర్డులు ఒరియాలోనే రాయాలని తీర్మానించారు. కార్యక్రమంలో రామచంద్ర పండా, బిబూతి జనా, ప్రొఫెసర్ ప్రఫుల్ల మహంతి, హారికా కానంగో, దొండపాని మహపాత్ర తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా స్వచ్ఛంద సంస్థలు



టెక్కలి: ఆర్థికసాయం అందిస్తున్న ప్రతినిధి

ప్రజాశక్తి - కవిటి

అడగకుండానే అమ్మ అయినా అన్నం పెట్టదని అంటారు పెద్దలు.. కానీ మండలంలోని పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆపదలో ఎవరెవరు ఉన్నారో వెతికి మరీ తమ సహాయ సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తున్నాయి. మండలంలోని కొజ్జిరియా, కవిటి గ్రామాలకు చెందిన బడగల కామేష్, పొల్లాయి ఆనంద్‌కు ఎస్‌జిఎఫ్, జై హింద్ ఫౌండేషన్ సంస్థలు అండగా నిలిచాయి. కొజ్జిరియా గ్రామానికి చెందిన బడగల కామేష్ ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. నడుము భాగం నుంచి కాళ్ల వరకు పూర్తిగా పనిచేయకపోవడంతో మంచంపైనే అన్ని పనులూ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తల్లిదండ్రులు దినసరి కూలీలు కావడంతో కామేష్‌కు మెరుగైన వైద్యం చేయించలేకపోతున్నారు. దీంతో విషయం తెలుసుకున్న ఎస్‌జిఎఫ్ సభ్యులు ఆదివారం గ్రామానికి చేరుకుని తక్షణ సాయంగా రూ.10వేలు అందజేశారు. అదే విధంగా కవిటి గ్రామానికి చెందిన పొల్లాయి ఆనంద్ తీవ్ర అనారోగ్యానికి గురై విశాఖపట్నంలో చికిత్స పొంది ఇటీవలే ఇంటికి చేరుకున్నాడు. ఆనంద్ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో తదుపరి వైద్య ఖర్చుల కోసం దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. విషయం తెలుసుకున్న జై హింద్ ఫౌండేషన్ సభ్యులు ఆనంద్‌కు రూ.5వేలు అందజేశారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి మనం అందించే ప్రతి రూపాయి విలువైనదని, ప్రస్తుతం దాతల సాయం కోసం ఎదురు చూస్తున్న బడగల కామేష్, పొల్లాయి ఆనంద్‌ను ఉదారంగా ఆదుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు దట్టి మహేష్, పాండవ శేఖర్, పొల్లాయి లక్ష్మణమూర్తి, సునీల్, శ్రీకాంత్, శ్రీను, ఎస్జిఎఫ్, జై హింద్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మెళియాపుట్టి: మండలంలోని వసుంధర గ్రామంలో ఇటీవల తల్లితండ్రులను కోల్పోయిన చిన్నారులు సలానా షణ్ముఖరావు, కార్తీకకు పాతపట్నం తూర్పుకాపు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.36వేలు చెక్కును ఆదివారం ఆదించారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కోయిలపు శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సలానా చిరంజీవి, యువజన ఉపాధ్యక్షులు టంకాల. సుధాకర్, రాంబాబు ఆ చెక్కును అందించారు. కార్యక్రమంలో వసుంధర సర్పంచ్ సలాన అప్పలనాయుడు, సలాన గిరిధర్, సంపత్‌రావు, మధు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు



కామేష్‌కు ఆర్థికసాయం అందిస్తున్న ఎస్‌జిఎఫ్ సభ్యులు

సంతబొమ్మాళి: వెంకటాపురానికి చెందిన గున్న సురేష్ కొన్ని నెలల నుండి కాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకుని కాపుగోదాయవలస గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ ఆదివారం రూ.7వేలు ఆర్థిక సాయం అందించారు. మానవత్వంతో సహాయం చేయడానికి ముందుకు వచ్చిన వారికి కుటుంబ సభ్యులు, వెంకటాపురం గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

రూ.10వేలు ఆర్థిక సాయం

నందిగాం: మండలంలోని దిమిలాడలి గ్రామానికి చెందిన జాయి శివాజీ కుమార్తె శ్రీవిద్య రెండు రోజుల క్రితం శ్వాస తీసుకోవడం ఇబ్బంది పడటంతో కుటుంబసభ్యులు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు రోజుకు రూ.లక్ష అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆర్థికస్థోమత లేని ఆమె తండ్రి శివాజీ ఏమీ చేయాలో తెలియక కెజిహెచ్‌కు తీసుకెళ్లి వైద్యం అందిస్తున్నాడు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న విశ్వేశ్వర సేవా సంఘం పాప తల్లికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించింది.

సబ్‌ప్లాన్ నిధులు వారికే కేటాయించాలి

కెఎన్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్

ప్రజాశక్తి - పలాస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్‌సి,ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను వారికే కేటాయించాలని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకర్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహిస్తున్న కెఎన్‌పిఎస్ జిల్లా 6వ మహాసభలు ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిన 28 సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఎస్‌సిలో ఉప కులమైన దండాసి, మరో ఐదు కులాలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా పోరాడాలని పిలుపునిచ్చారు. ఏనేటి కొండలను ఎస్‌టి తెగల్లోనే కొనసాగించి, ధ్రువపత్రం ఇచ్చే వరకు ఉద్యమిస్తామని తెలిపారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాప్తికి కారణాలు తెలుసుకోవడానికి నిర్మాణంలో ఉన్న రీసెర్చ్ సెంటర్‌కు సరిపడ నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టి ఆధీనంలో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని, వారందరికీ రైతు భరోసా పథకం వర్తింపజేయాలని తీర్మానం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటికరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా బెలమర ప్రభాకర్, ఉపాధ్యక్షుడు నల్లబారికి గురుమూర్తి, ప్రధాన కార్యదర్శిగా జగన్నాథం, సహాయ కార్యదర్శి రాకోటి రాంబాబు, కోశాధికారి లోపింటి బైరాగి, ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కష్ణ ప్రకటించారు.

ఐక్యతను చాటాలి

ప్రజాశక్తి - టెక్కలి



పట్టుశాలి సంఘం నూతన కార్యవర్గం

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కులాలు, సంఘాలు బలపడి ఐక్యతను చాటాలని పట్టుశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు మల్లిపెద్ది మధుసూదన్‌రావు అన్నారు. సంఘ సమావేశం ఆదివారం టెక్కలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిస్థితులకు అనుగుణంగా సంఘాలు పరిపుష్టి కావాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు భావన రుషి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకుముందు ఉద్యోగ విరమణ పొందిన సాంబశివరావు, ఆనందరావు, రఘునాథరావు, ఆట్ల రవిను సత్కరించారు. గౌరవాధ్యక్షులుగా దుంపా లోకేశ్, అధ్యక్షులుగా మల్లిపెద్ది మధుసూదనరావు, ఉపాధ్యక్షులుగా బుడ్డి భుజంగరావు, కార్యదర్శిగా దుంపా శ్రీనివాస్; సంయుక్త కార్యదర్శిగా బుడ్డి నందికేష్, కోశాధికారిగా కొండవీటి అచ్యుతరావు, కన్వీనర్లుగా ఆట్ల రవి, దుంపా మోహన్‌రావు, పేకల సోమేశ్వరరావు, ఆట్ల వెంకటేశ్వరరావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు ఆట్ల పార్వతీశం, దున్న సాంబశివరావు, బసవ శ్యామసుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి -మెళియాపుట్టి



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఈశ్వరి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఆదివారం భరణికోట పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సిఎం కృషి చేస్తున్నారని అన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. భరణికోట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో రూ.48 లక్షలతో చేపట్టే నాడు నేడు పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ట్రైకర్స్ డైరెక్టర్ సవర ఈశ్వరి సుభాష్ దంపతులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు యు బాలరాజు, వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కవిటి: పొల్లాయి నరేష్ ఇదే ఉత్సాహంతో క్రీడల్లో రాణించి, భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు పొల్లాయి లక్ష్మణమూర్తి ఆకాంక్షించారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన స్కూల్ ఫెడరేషన్ క్రీడల్లో పాల్గొన్న పొల్లాయి నరేష్ బ్యాడ్మింటన్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా స్థానిక అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నరేష్‌ను ఘనంగా సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరింత మెరుగైన ప్రదర్శనతో చదువుకున్న పాఠశాలతో పాటు గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో పొల్లాయి అప్పారావు, సింహాచలం, ముకుందరావు, దున్న పురుషోత్తం, పోల్లాయి శ్రీను, దేవరాజు, రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి

వజ్రపుకొత్తూరు: జూనియర్ కళాశాల అభివృద్ధికి తనవంతు కషి చేస్తానని జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం గోవిందపురం జూనియర్ కళాశాల ఆవరణలో నాడు, నేడు పనుల్లో భాగంగా చేపడుతున్న మంచినీటి బోరుబావి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.66 లక్షలతో నాడు, నేడు పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. తరగతి గదులు మరమ్మతులతో పాటు విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్ల నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయని ఆయన అన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు సహకారంతో కళాశాలను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్య ద్వారా మానవ వనరుల అభివద్ధికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రతినిధి పాలిన చిరంజీవి, పాలిన పాపారావు, గ్రామ పెద్దలు మెట్ట వెంకటరావు, డొక్కారి మోహన్‌రావు, పైల గంగాధర్ కళాశాల అధ్యాపకులు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న శ్రీనివాసరావు